






# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 295 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 1 జూలై 2025 వెల : 5/-రూ॥


VOLUME : 11 ISSUE :295 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 1 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




# అమెరికాలో సిలికాన్ వ్యాలీకి దీటుగా అమరావతిలో క్వాంటం వ్యాలీ

- అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- 2026 జనవరి 1 నాటికి ప్రారంభించాలని లక్ష్యం
- ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజాలతో భాగస్వామ్యం
- హైటెక్ సిటీ తరహాలో అమరావతిని టెక్నాలజీ హబ్‌గా మార్చే ప్రణాళిక
- ఆగస్టు 15 నుంచి 100% పౌరసేవలు వాట్సప్ ద్వారా అందించేందుకు ఏర్పాట్లు
- క్వాంటం వ్యాలీ బాధ్యతలను మంత్రి నారా లోకేశ్‌కు అప్పగించిన ముఖ్యమంత్రి




**పెన్ పవర్ డెస్క్:**అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి దీటుగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 'క్వాంటం వ్యాలీ'ని ఏర్పాటు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. దీనిని 2026 జనవరి 1 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రఖ్యాత సంస్థల భాగస్వామ్యంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన 'అమరావతి క్వాంటం వ్యాలీ' జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన ప్రముఖ బహుళ జాతి సంస్థల ప్రతినిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ టెక్నాలజీకి కేంద్రంగా మార్చాలనే సంకల్పం తో పనిచేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

**హైటెక్ సిటీ స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి అనుభవాలను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "నేను తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఐటీ పరిశ్రమ ప్రాముఖ్యతను గుర్తించి మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో చర్చించాను. పీపీపీ పద్ధతిలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించాలని ఎల్ అండ్ టీని కోరాను. ఆ స్ఫూర్తితోనే ఇప్పుడు అమరావతిని అధునాతన సాంకేతిక కేంద్రంగా తీర్చిది ద్దుతాం. భవిష్యత్తులో భారత్ అతిపెద్ద ఐటీ హబ్‌గా మారుతుందని నేను అప్పుడే చెప్పాను" అని వివరించారు.

**పాలన, వ్యవసాయంలో క్వాంటం టెక్నాలజీ**

క్వాంటం కంప్యూటింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను ముఖ్యమంత్రి వివరిస్తూ, ఇది కేవలం ఒక కంప్యూటర్‌ను తీసుకురావడమే కాదని, దాని ద్వారా పూర్తిస్థాయి ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తామని అన్నారు. "వ్యవసాయంలో నేల తేమ, ఎరువుల వాడకం వంటి అంశాలను పర్యవేక్షించడానికి, ప్రభుత్వ సేవలను వేగంగా ప్రజలకు అందించడానికి క్వాంటం టెక్నాలజీ ఎంతో అవసరం. ఇప్పటికే ఏపీలో వాట్సప్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం.

వివరాలు 2లో..

## అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తాం

- అమరావతి క్యాంటమ్ వ్యాలీ ద్వారా వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- 50కి పైగా యూనికార్న్‌ల అభివృద్ధి
- చంద్రబాబు సాంకేతిక విప్లవంలో సెకండ్ చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ
- అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్ లో మంత్రి నారా లోకేశ్




**పెన్ పవర్ డెస్క్:**సీఎం చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కం ప్యూటింగ్ వ్యాలీ అని, ప్రజారాజధాని అమరావతిని దక్షిణాసి యాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడలోని నోవాటెల్ హెూటల్ లో నిర్వహించిన అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్ లో సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ వర్క్ షాప్ కు హాజరైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, విద్యారంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఇతర అధికారులకు స్వాగతం. అమరావతి వర్క్ షాప్-2025కు మిమ్మల్ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. ఇవాళ ఈ సమావేశం దేశంలో అత్యుత్తమ క్వాంటమ్ మేధావుల సమావేశం మాత్రమే కాదు. దేశంలో ఓ కీలక మలుపు కానుంది. భవిష్యత్ లో రాబోయే సాంకేతిక విప్లవానికి సీఎం చంద్రబాబు నేతృత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నారనే సంకేతాన్ని ఇస్తోంది.

**అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తాం**

అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మార్చాలనేది మా లక్ష్యం.

వివరాలు 2లో..

## ఏపీకి కేంద్రం బిగ్ షాక్.. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు నిరాకరణ



**పెన్ పవర్ డెస్క్:** ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్ విషయం లో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్?కు తేల్చిచెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిప్పిపంపింది.బనకచర్ల ప్రాజెక్ట్?కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది.

వివరాలు 2లో..

## కర్ణాటకకు కొత్త ముఖ్యమంత్రి?

### సీఎం మార్పుపై ఖర్గే కీలక వ్యాఖ్యలు

- వదంతులను ఖండించకుండా.. నిర్ణయం అధిష్టానానిదేనన్న ఖర్గే
- త్వరలో డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి అవకాశమని ఎమ్మెల్యేల ప్రకటనలు
- త్వరలో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులంటూ సంకేతాలు
- సుర్జేవాలా బెంగళూరు పర్యటనతో ఊపందుకున్న ఊహాగానాలు

వివరాలు 2లో..



## మోదీని నిలదీసే ధైర్యం వారికెక్కడిది

### జగన్, చంద్రబాబులపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు

- చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోదీకి దాసోహమయ్యారన్న షర్మిల
- కాంగ్రెస్ లోకి రావాలంటూ నేతలు, యువతకు సూచన
- రాహుల్ ప్రధాని అయితే విభజన హామీలు అమలవుతాయని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దాసోహమయ్యారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించే సత్తా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం ఈ జూన్ నెలలోనే 26 జిల్లాల్లో సుమారు 2,500 కిలోమీటర్లు పర్యటించానని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కినా, రాష్ట్రానికి

వివరాలు 2లో..

## నక్సలైట్లను చంపగలరేమో, నక్సలిజాన్ని అంతం చేయలేరు

- అమిత్ షా వ్యాఖ్యలకు సీపీఐ నారాయణ కౌంటర్
- నక్సలైట్లతో చర్చలుండవన్న అమిత్ షా వ్యాఖ్యలు
- అమిత్ షా వ్యాఖ్యలపై సీపీఐ నారాయణ తీవ్ర స్పందన



**పెన్ పవర్ డెస్క్:**నక్సలిజం నిర్మూలనపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. నిజామాబాద్ పర్యటనలో షా చేసిన ప్రకటనపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఘాటుగా స్పందించారు. నక్సలైట్లను చంపగలరేమో కానీ, నక్సలిజాన్ని మాత్రం అంతం చేయలేరని ఆయన అన్నారు.

వివరాలు 2లో..

## జేసీ ముండమోపి రాజకీయాలు చేస్తున్నాడు

- జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఎస్పీకి వైసీపీ నేతల ఫిర్యాదు
- కోర్టు అనుమతించినా తాడిపత్రిలోకి రానివ్వడం లేదని కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆవేదన
- వైసీపీ కార్యకర్తలను నరుకుతానంటూ జేసీ బెదిరిస్తున్నారని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తూ జిల్లా ఎస్పీ జగదీష్‌కు ఈరోజు ఫిర్యాదు చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు ఎస్పీ కార్యాలయానికి

వివరాలు 2లో..

## గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది

- గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు
- మున్సిపల్ శాఖకు చెందిన రూ.3 వేల కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపణ
- రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని వ్యాఖ్య
- నెల్లూరులో కాలువల పూడికతీత పనులను పరిశీలించిన మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ శాఖ కు చెందిన సుమారు రూ.3 వేల కోట్ల నిధులను పక్కదారి పట్టించిందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారా యణ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి, రూ.10 లక్షల కోట్ల అప్పులను ప్రజలపై మోపిందని

వివరాలు 2లో..

## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్..

### ఖరారు చేసిన అధిష్ఠానం

- ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- నేడు విజయవాడలో అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ
- ఎన్నికల పరిశీలకుడిగా కర్ణాటక ఎంపీ మోహన్



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ బీజేపీ అధ్యక్ష పదవిపై నెలకొ న్న ఉ త్కంఠకు తెరపడింది. పార్టీ రాష్ట్ర నూతన సారథిగా మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర

వివరాలు 2లో..

## మహాకూటమితో పొత్తుకు సిద్ధం

- బీహార్ ఎన్నికల్లో పొత్తులపై అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు
- బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య
- బీహార్ ఓటర్ల జాబితాపై తీవ్ర అభ్యంతరం



**పెన్ పవర్ డెస్క్:**బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కూడిన మహాకూటమితో పొత్తు కోసం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు.

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## మారిన చంద్రబాబు వ్యూహం..

# అందుకే 2029

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు టార్గెట్ సవరించుకున్నారా? అన్న చర్చ జరుగుతోంది. విజన్ 2047 పేరుతో 25 ఏళ్ల సుదీర్ఘ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న చంద్రబాబు.. ఇప్పుడు 2029 టార్గెట్ తోనే పనిచేస్తున్నారని అంటున్నారు. ఆదివారం నిర్వహించిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో చంద్రబాబు 2029 లక్ష్యంతోనే పనిచేస్తున్నట్లు వెల్లడించారు. సాధారణంగా 25, 30 ఏళ్లు తానే సీఎం అన్నట్లు మాట్లాడే చంద్రబాబు ఇప్పుడు ఈ ఐదేళ్ల తోపాటు మరో ఐదేళ్లు చాలు అన్నట్లుగా ప్రకటన చేయడం ఆసక్తికరంగా మారింది. టార్గెట్ 2029 అన్నట్లే తన నిర్ణయాలు ఉంటాయని ఆదివారం నాటి సమావేశంలో చంద్రబాబు ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాత్రం తమ ప్రభుత్వం మరో 25 ఏళ్లు ఉండాలని కోరుకుంటున్నారు. తమ పొత్తును ఎవరూ విచ్ఛిన్నం చేయలేరని చెబుతున్నారు. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం మరో ఐదేళ్లు అధికారంలో ఉంటే చాలు అన్నట్లు మాట్లాడటమే అందరినీ ఆలోచనలకు గురిచేస్తోంది. ఎప్పుడూ సుదీర్ఘ లక్ష్యాలు నిర్దేశించుకుని మాట్లాడే చంద్రబాబేనా? ఇలా మాట్లాడుతుంది అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు.

అయితే చంద్రబాబు తన టార్గెట్ సవరించుకోడానికి చాలా కారణాలు ఉన్నాయని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విజన్ 2020 పేరుతో పనిచేసిన చంద్రబాబు ఇప్పుడు స్వర్ణాంధ్ర 2047 నిర్దేశించుకున్నారు. అయితే ఆయన వయసు దృష్ట్యా 25 ఏళ్లు లక్ష్యంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. 75 ఏళ్ల వయసులో చంద్రబాబు 25 ఏళ్లు ప్రణాళిక పెట్టుకోవడంపై మాజీ సీఎం జగన్ పలుమార్లు బహిరంగంగా విమర్శలు గుప్పించారు. అయితే తనను వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా కొనసాగించకపోవడం వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతోందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. మంత్రి నారా లోకేశ్ సైతం పలుమార్లు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే స్థిరమైన అభివృద్ధి సాధించకవచ్చని పిలుపునిస్తున్నారు.

మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి వైసీపీ నేతల అరెస్టు పర్వం కొనసాగుతోంది. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అదుపు చేసేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. మరోవైపు తాము 2029లో అధికారంలోకి వస్తే 'రప్పా.. రప్పా..' అంటూ వైసీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తన వ్యూహాన్ని మార్చుకున్నారని అంటున్నారు. సుదీర్ఘ ప్రణాళికతో 20, 30 ఏళ్లు అధికారం అంటే ఉపయోగం లేదని భావిస్తున్న చంద్రబాబు ముందుగా ఐదేళ్లు.. తర్వాత మరో ఐదేళ్లు అన్న నినాదాన్ని తలకెత్తుకున్నట్లు చెబుతున్నారు.

ప్రస్తుతం ఐదేళ్ల పాలనలో ఏడాది పూర్తయిందని, ఇంకా నాలుగేళ్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చి ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో 2029 ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలన్న టార్గెట్ పెట్టుకుని పనిచేస్తున్నారని చెబుతున్నారు. తాను ఒక్కడే కాకుండా, ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా కలిసికట్టుగా పనిచేస్తేనే అధికారం వస్తుందని అంటున్న చంద్రబాబు.. తన దారిలో అడ్డుగా నిలిచే ఎమ్మెల్యేలను వదులుకుంటానని ఘాటు వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమవుతోంది. వచ్చే ఎన్నికల్లో గెలిస్తేనే కుమారుడు లోకేశ్ కి అధికార బదిలీ చేయడం సాధ్యమవుతుందన్న ఆలోచన కూడా ఇందులో ప్రధానమంటున్నారు. దీంతో చంద్రబాబు విజన్ 2047కి ముందు టార్గెట్-2029 నిర్దేశించుకున్నట్లు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ద

## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్..

- మొదటి పేజీ తరువాయి

బీజేపీలో నాయకత్వ మార్పు ఖాయమైంది.అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను మంగళ వారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కర్ణాటకకు చెందిన ఎంపీ మోహన్‌ను ఎన్నికల పరిశీలకుడిగా నియమించారు. ఇందులో భాగంగా పీవీఎన్ మాధవ్ ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు.

పీవీఎన్ మాధవ్‌కు పార్టీలో, అనుబంధ సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన శాసన మండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) సేవలందించడమే కాకుండా, మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్‌లో చురుకుగా పనిచేసిన ఆయన, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)లో కూడా పనిచేశారు.మాధవ్ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి, దివంగత నేత చలపతిరావు బీజేపీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. చలపతిరావు కూడా గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేశారు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని, పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పీవీఎన్ మాధవ్ ఇప్పుడు రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపట్టబోతున్నారు.

## మహాకూటమితో పొత్తుకు సిద్ధం

- మొదటి పేజీ తరువాయి

బీహార్ రాష్ట్ర ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్ నేతృత్వంలో ఎన్నికల ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఒవైసీ తెలిపారు. బీజేపీ, ఎన్డీఏలను కట్టడి చేసేందుకు మహాకూటమితో కలిసి పనిచేయాలని భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా తమ పార్టీకి క్రియాశీల కార్యకర్తల బలం అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వివరించారు. గతంలో కూడా ఎన్డీఏను నిలువరించడానికి తీవ్రంగా ప్రయత్నించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

అయితే, పొత్తుల విషయంలో మహాకూటమి పార్టీలు ముందుకు రాని పక్షంలో తమ ప్రణాళిక భిన్నంగా ఉంటుందని ఒవైసీ తేల్చిచెప్పారు. పొత్తులు కుదరకపోతే, బీహార్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఇదే సమయంలో, బీహార్‌లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిబంధనల వల్ల వేలాది మంది నిరుపేదలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ముఖ్యంగా సీమాంచల్ వంటి ప్రాంతాల్లో వరదల కారణంగా సర్వం కోల్పోయి అనేక కుటుంబాలు వలస వెళ్తుంటాయని అన్నారు. అలాంటి నిరుపేదలను ఓటరుగా నమోదు కావడానికి బర్త్ సర్టిఫికెట్, నివాస ధ్రువపత్రంతో పాటు తల్లిదండ్రుల నివాస పత్రాలు కూడా చూపాలని అడగడం సరికాదని ఆయన అన్నారు. ఈ కఠిన నిబంధనల వల్ల పేదలు తమ ఓటు హక్కుకు దూరమవుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా మారుస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఇక్కడ ఆలోచనలు ఆవిష్కరణలుగా, ఆవిష్కరణలు పరిశ్రమలుగా మారేలా ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇది ఒకరోజు కార్యక్రమం కాదు. ఇది దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఉద్యమం. ఇందుకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా నిలవబోతోంది. క్యూబిట్ ఆర్కిటెక్చర్ నుంచి క్రయో ఎలక్ట్రానిక్స్ వరకు, ఆల్గోరిథం అభివృద్ధి నుంచి అంతర్జాతీయ క్వాంటమ్ ప్రమాణాల వరకు మేం పూర్తిస్థాయిలో క్వాంటమ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తాం. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన 156 క్యూబిట్లను కలిగిన ఐబీఎం క్యాంటమ్ సిస్టమ్-2 త్వరలోనే అమరావతిలో అందుబాటులోకి రానుంది. ఇది చాలా గర్వించదగ్గ విషయం.

ఆసియాలో మొట్టమొదటి క్వాంటమ్ ప్రమాణాల టెస్ట్‌బెడ్‌ను ఎన్పీఎల్, ఐఈఈఈ, సీయాక్, ఏడబ్ల్యూఎస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఐబీఎం, టీసీఎస్, హెచ్ సీఎల్, టెక్ మహీంద్ర వంటి అగ్రగామి సంస్థల సహకారంతో క్యాంటమ్ స్టారప్ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. ఈ కార్యాచరణకు వ్యూహాత్మక దూరదృష్టి ఉంది. ఇది ప్రధాని మోదీ ప్రకటించిన జాతీయ క్వాంటమ్ మిషన్ కు అనుసంధానంగా, గ్లోబల్ భాగస్వామ్యాలతో నిర్మించడం జరుగుతుంది. ఐఐటీలు, ఐఐఎస్, టోక్యో యూనివర్సిటీల సహకారం తీసుకోవడం జరుగుతుంది.

**చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ**

సీఎం చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ. చంద్రబాబు మొదటి చాప్టర్ ఐటీ అన్నప్పుడు నేను ఏడో తరగతి చదువుతున్నాను. దక్షిణాసియా క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుంది. సాఫ్ట్ వేర్ రంగానికి సిలికాన్ వ్యాలీగా అమరావతి క్యాంటమ్ వ్యాలీ అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు విజన్ సాధనకు అనుగుణంగా పనిచేస్తూ ప్రపంచపటంలో అమరావతి క్యాంటమ్ కు చోటు దక్కేలా కృషిచేద్దాం.

**ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది**

సీఎం చంద్రబాబు లాంటి నాయకుడు ఉండటం మన అదృష్టం. విజన్ అంటే ఇప్పుడు వెలాసిటీ, ఇన్నోవేషన్. గ్లోబల్ రేస్ లో చేరడం కాదు.. మనమే దారి చూపాలి. ఫలితంగా ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది. క్వాంటమ్ సైన్స్ ను ఇంజనీరింగ్ లోనూ భాగం చేస్తున్నాం. అమరావతిని క్యాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా మారుస్తాం. ఇన్నోవేటివ్, స్టార్టప్ లకు ఈ క్యాంటమ్ వ్యాలీ పార్క్ ఓ లాంచ్ ప్యాడ్ అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సందీప్ పటేల్, ఐబీఎం క్వాంటమ్ అడాప్షన్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రోడర్, టీసీఎస్ టెక్నాలజీ, స్టాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, ఎల్ అండ్ టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, అడ్వైజర్ ఎంవీ సతీశ్, ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కే మధుమూర్తి, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోఠి, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకకు కొత్త ముఖ్యమంత్రి?

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందంటూ కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు మరింత ఊతమిచ్చాయి. ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలను ఆయన ఖండించకపోవడం గమనార్హం. ఈ వ్యవహారానికి సంబంధించిన తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం చేతుల్లో ఉంటుందని స్పష్టం చేసి, ఉత్కంఠను మరింత పెంచారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రానున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా బెంగళూరు పర్యటన ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో, సోమవారం విలేకరులు అడిగిన ప్రశ్నకు ఖర్గే సమాధానమిస్తూ, "అక్టోబర్‌లో కర్ణాటక ముఖ్యమంత్రిని మారుస్తారని అంటున్నారు కదా?" అని అడగగా, "అది అధిష్టానం పరిధిలోని అంశం. అధిష్టానంలో ఏం జరుగుతుందో ఇక్కడ ఎవరూ చెప్పలేరు. ఈ విషయాన్ని అధిష్టానానికే వదిలేశాం, తదుపరి చర్యలు తీసుకునే అధికారం వారికే ఉంది. ఎవరూ అనవసరంగా సమస్యలు సృష్టించకూడదు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. మరోవైపు, డీకే శివకుమార్ వర్గానికి చెందిన నేతలు నాయకత్వ మార్పుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్.ఏ. ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ, "వచ్చే రెండు, మూడు నెలల్లో డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రావొచ్చు" అని అన్నారు. పార్టీ గెలుపు కోసం శివకుమార్ పడిన శ్రమ, ఆయన వ్యూహాలు అందరికీ తెలుసని, సరైన సమయంలో అధిష్టానం ఆయనకు అవకాశం ఇస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్రంలో రాజకీయపరమైన కీలక మార్పులు ఉంటాయని కొందరు నేతలు చెబుతున్నారని, దాని గురించే తాను మాట్లాడుతున్నానని ఆయన స్పష్టం చేశారు.ఇదే తరహాలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న కూడా ఇటీవల మాట్లాడుతూ, సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో కీలక

మార్పులు ఉంటాయని సంకేతాలిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారని, తదుపరి నిర్ణయం కూడా వారే తీసుకుంటారని ఎమ్మెల్యే హుస్సేన్ గుర్తుచేశారు. 2023 మే నెలలో కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఘన విజయం సాధించినప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆ సమయంలో, అధిష్టానం ఇరువురి మధ్య రాజీ కుదిర్చి, సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా, శివకుమార్‌ను ఉప ముఖ్యమంత్రిగా నియమించింది. రెండున్నరేళ్ల తర్వాత శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చేలా వీరి మధ్య 'రొటేషనల్ సీఎం' ఒప్పందం జరిగిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే, పార్టీ దీనిని అధికారికంగా ఎప్పుడూ ధృవీకరించలేదు. తాజా పరిణామాలతో ఈ ఒప్పందం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఖర్గే వ్యాఖ్యలతో ఇప్పుడు అందరి దృష్టి కాంగ్రెస్ అధిష్టానం తీసుకోబోయే నిర్ణయంపై కేంద్రీకృతమై ఉంది.

## నక్సలైట్లను చంపగలరేమో, నక్సలిజాన్ని అంతం చేయలేరు

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఈరోజు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు.వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నారాయణ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విధానాలు మారనంత వరకు ఇలాంటి సమస్యలు పరిష్కారం కావని ఆయన అభిప్రాయపడ్డారు. నక్సలైట్లతో చర్చలు జరపబోమని చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నక్సలిజంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నక్సలైట్లు తక్షణమే హింసను వీడి, ఆయుధాలు పక్కనపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. వారు ఆయుధాలు వీడేంత వరకు వారితో ఎలాంటి చర్చలు ఉండవని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. "గిరిజన బిడ్డలను, పోలీసులను నక్సలైట్లు చంపినప్పుడు వారి తరఫున ఎవరూ మాట్లాడలేదు. కానీ ఇప్పుడు మాత్రం చర్చల కోసం చాలా మంది ముందుకొస్తున్నారు" అని కొందరి వైఖరిని దుయ్యబట్టారు. అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే సీపీఐ నారాయణ పైవిధంగా స్పందించారు.

## మోదీని నిలదీసే ధైర్యం వారికెక్కడిది

- మొదటి పేజీ తరువాయి

చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా కేంద్రా న్ని నిలదీసే పరిస్థితిలో లేరని షర్మిల ఆరోపించారు. "కేంద్రంలో మోదీ అధికారం లో ఉండటానికి చంద్రబాబే కారణం. అయినా కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన కేంద్రంపై కనీస ఒత్తిడి తీసుకురావడం లేదు. మరోవైపు, కేంద్రం మెడలు వంచుతామని చెప్పిన జగన్ చివరికి తన మెడనే మోదీ ముందు వంచారు" అని ఆమె ఎద్దేవా చేశారు. జగన్ ఇప్పటికీ మోదీని ఒక్క మాట అనకుండా, కేవలం చంద్రబాబును విమర్శిస్తూ దత్తపుత్రుడిలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకు కుదిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నా, రాష్ట్రం నుంచి ఒక్క ఎంపీ కూడా దానిపై మాట్లాడకపోవడం దారుణమని షర్మిల మండిపడ్డారు. రాజధాని అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇవ్వడమేంటని ఆమె ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామన్న హామీపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదని గుర్తుచేశారు. విభజన హామీలు ఏపీ అమలు కాకపోయినా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోదీకి మద్దతు పలకడం విచారకరమన్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మొదటి నుంచి బీజేపీని వ్యతిరేకించారని, కానీ జగన్ మాత్రం మోదీకి గులాంగిరీ చేశారని విమర్శించారు. రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని షర్మిల ధీమా వ్యక్తం చేశారు. "రాజకీయాలపై ఆసక్తి ఉండి, భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనుకునే వారు, రాష్ట్రానికి సేవ చేయాలనుకునే వారు కాంగ్రెస్‌లోకి రావాలి. అందరం కలిసి పనిచేద్దాం" అని ఆమె పిలుపునిచ్చారు.

పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, వైఎస్ఆర్ వంటి నేతల త్యాగాలతో నిండిన కాంగ్రెస్ పార్టీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే రాష్ట్ర విభజన హామీలు పూర్తిగా అమలవుతాయని పేర్కొంటూ, సోనియా, రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ తిరిగి బలపడుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది

- మొదటి పేజీ తరువాయి

ఆయన విమర్శించారు. సోమవారం నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ పొగతోటలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు అనుభ వంతో రాష్ట్రంలో పరిస్థితులు మళ్లీ గాడిన పడుతున్నాయని అన్నారు. "గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. రూ.పది లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి మిగిల్చి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు అనుభవంతో పరిస్థితులు గాడిన పడుతున్నాయి. వైసీసీ ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నాం" అని ఆయన తెలిపారు.నెల్లూరు నగరంలో 6.7 కిలోమీటర్ల మేర ఉన్న కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించామని, రాబోయే 15 రోజుల్లో ఈ పనులను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ అధికారులను

ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.అలాగే

పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు సిద్ధం చేసిన వీఆర్ హైస్కూల్‌లో సోమవారం నుంచే తరగతులు ప్రారంభిస్తున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంలో నిలుపుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అమెరికాలో సిలికాన్ వ్యాలీకి దీటుగా అమరావతిలో క్వాంటం వ్యాలీ

- మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 15 నాటికి వంద శాతం సేవలను వాట్సప్ ద్వారానే అందించేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. సీసీ కెమెరాలు, సెన్సార్ల ద్వారా వచ్చే రియల్ టైమ్ డేటాను విశ్లేషించేందుకు ఈ టెక్నాలజీ కీలకం కానుందని చెప్పారు.

**స్టార్టప్‌లకు, పెట్టుబడులకు ఆహ్వానం**

క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లకు అపార అవకాశాలు ఉన్నాయని, ఆవిష్కరణలకు ఆకాశమే హద్దని చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బహుళజాతి కంపెనీలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. "పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి టెక్నాలజీయే సరైన మార్గం. హైదరాబాద్‌లో నిర్మించిన హైటెక్ సిటీ వల్లే నేడు తెలంగాణ ఆదాయంలో 75 శాతం అక్కడి నుంచే వస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీ కూడా దేశానికే మార్గదర్శకంగా నిలవాలి" అని ఆకాంక్షించారు.ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును విజయవంతం చేసే బాధ్యతను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు అప్పగించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అనంతరం మంత్రి లోకేశ్‌తో కలిసి వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెక్నాలజీ స్టార్టప్‌ల స్టాళ్లను పరిశీలించారు.

## జేసీ ముండమోపి రాజకీయాలు చేస్తున్నాడు

- మొదటి పేజీ తరువాయి

వెళ్లి తమ ఫిర్యాదును అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ, హైకోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ పోలీసులు తనను తాడిపత్రి నియోజకవర్గంలోకి అడుగుపెట్టనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "నన్ను తాడిపత్రి వెళ్లేందుకు హైకోర్టు అనుమతించింది. నాకు భద్రత కల్పించాలని రెండు నెలల క్రితమే ఉన్నత న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. అయినా ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదు" అని ఆయన తెలిపారు. జేసీ ప్రభాకర్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, "వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రపా.. రపా.. నరుకుతా" అంటూ బహిరంగంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని కేతిరెడ్డి ఆరోపించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాడిపత్రిలో శాంతియుత వాతావరణం ఉండేదని, ఇప్పుడు జేసీ ప్రభాకర్ రెడ్డి "ముండమోపి రాజకీయాలు" చేస్తూ హింసను ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. తన మద్దతుదారులపై దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని, కేవలం ఒక మున్సిపల్ ఛైర్మన్ చెబితే పోలీసులు నడుచుకోవడం సరికాదని అన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలపై జేసీ ప్రభాకర్ రెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని ఆయన సవాల్ విసిరారు.వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ, కేతిరెడ్డి పెద్దారెడ్డిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దారుణమని అన్నారు. హైకోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నా పోలీసులు వాటిని అమలు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా "రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో" అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా తాడిపత్రిలో కూడా ఈ కార్యక్రమం చేపట్టాల్సి ఉందని తెలిపారు."తాడిపత్రిలో నియంత పాలన కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై ఏవైనా ఆంక్షలు ఉంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలి. పార్టీ కార్యక్రమాల నిర్వహణ కోసం ఆయన్ను వెంటనే నియోజకవర్గంలోకి అనుమతించాలి" అని వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుపై ఎస్పీ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వైసీపీ నేతలు తెలిపారు.

## ఏపీకి కేంద్రం బిగ్ షాక్.. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు నిరాకరణ

- మొదటి పేజీ తరువాయి

సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్?కు సూచించింది. కాగా, ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి చాలా ఫిర్యాదులు అందాయి. ఈ ప్రాజెక్టును మొదటి నుంచి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వెంటనే ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్రానికి ఫిర్యాదులు చేసింది. ఈ క్రమంలో బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఏపీ పంపిన ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది. బనకచర్ల ప్రాజెక్ట్?పై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కమిటీ.. అనుమతులు ఇవ్వడానికి తిరస్కరించింది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే గోదావరి ట్రిబ్యూనల్ తీర్పు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్ట్ గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమంటూ అనేక ఫిర్యాదులు వచ్చాయని కమిటీ వెల్లడించింది.

# అవసరమైతే వేరే రాష్ట్రాల్లోని ఫోన్లు ట్యాప్ చేసేలా కేంద్రం ప్లానింగ్?



**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్ద ఎత్తున చర్చకు దారి తీసే ఒక అంశాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు తెర మీదకు తీసుకొచ్చింది. ఇప్పటికే తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఫోన్ ట్యాపింగ్ ఉదంతంపై రచ్చ నడుస్తున్న వేళ.. ఫోన్ ట్యాపింగ్ అంశంపై కేంద్రం కొత్త ముసాయిదాను ప్రతిపాదించింది. ఇప్పటివరకు రాష్ట్రంలోని వ్యక్తులు.. సంస్థల ఫోన్లను ట్యాప్ చేసే అధికారం (కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే) ఉన్న సంగతి తెలిసిందే. అందుకు భిన్నంగా రాష్ట్రం వెలుపల ఉన్న వ్యక్తుల ఫోన్లను కూడా ట్యాప్ చేసేందుకు వీలుగా రాష్ట్రాలకు కొత్త అధికారాలు దఖల పరుస్తూ కొత్త నిబంధనను ప్రతిపాదించింది.ఇందులో భాగంగా చట్టబద్ధమైన ట్యాపింగ్ నకు నిబంధనలు.. జాగ్రత్తలకు సంబంధించి టెలికమ్యూనికేషన్స్ నిబంధనలు 2024లో మార్పుల్ని పేర్కొంటూ కేంద్రంలోని కమ్యూనికేషన్ల శాఖ ముసాయిదా ప్రకటనను వెలువరించింది. ఇందులో రూల్ 2(సి) కింద ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ పరిధిలో అయితే కేంద్ర హెూం శాఖ కార్యదర్శి.. రాష్ట్ర పరిధిలో అయితే రాష్ట్ర హెూం శాఖ కార్యదర్శికి ఫోన్ ట్యాపింగ్నకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.దీనికి అదనంగా మరోరూల్ ను జోడించారు. ఇందులో ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం తన ప్రాదేశిక సరిహద్దుల బయట ఉన్న వ్యక్తుల ఫోన్లను కేంద్రం అనుమతితో ట్యాప్ చేయొచ్చు. అయితే సదరు రాష్ట్ర హెూం శాఖ కార్యదర్శి నుంచి వచ్చే వినతి ఆధారంగా కేంద్ర హెూంశాఖ కార్యదర్శి అనుమతి ఇచ్చేందుకు వీలుగా అవకాశాన్ని కల్పించారు. దీనిపై ఉన్న అభ్యంతరాలు.. అభిప్రాయాలను నెల లోపు అందజేయాలని కేంద్రం కోరింది.అయితే.. ఇతర రాష్ట్రాల్లోని వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేయటానికి ఎప్పుడు అనుమతిస్తారన్న దానిపైనా కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ప్రజా భద్రత.. ప్రజా అత్యవసర పరిస్థితి.. ప్రజా ప్రయోజనాల భద్రతకు సంబంధించిన అంశాల మీద కేంద్రం నుంచి రాష్ట్రం ట్యాపింగ్ నకు అనుమతి తీసుకోవచ్చు. దేశ రక్షణ.. జాతీయ భద్రత.. విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు.. శాంతిభద్రతల ప్రయోజనాల్ని కాపాడేందుకు వీలుగా.. ఏదైనా నేరాన్ని ముందుగా ఆరికట్టటానికి వీలుగా ఫోన్లు ట్యాపింగ్ చేసే వీలుంది.ఇక.. కేంద్రం తెర మీదకు తీసుకొచ్చిన ఈ ముసాయిదాపై తమ అభిప్రాయాల్ని వెల్లడించాలన్న ఆసక్తి ఉన్న వారు.. జాయింట్ సెక్రటరీ (టెలికాం), టెలి కమ్యూనికేషన్స్ డిపార్ట్ మెంట్, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, సంచార్ భవన్, 20 అశోకా రోడ్, న్యూఢిల్లీ 110 001. అయితే.. అభిప్రాయాల్ని నెల రోజుల్లోపు పంపించాల్సి ఉంటుంది.


# ఏకైక- హ్యాట్రిక్ ఎమ్మెల్యే.. రాజాసింగ్ దారెటు.. కాంగ్రెస్-బీఆర్ఎస్?



**హైదరాబాద్ పెన్ పవర్:** 2014లో తెలంగాణలో గెలిచిన ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేల్లో ఒకరైన రాజాసింగ్.. ఇప్పుడు ఆ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణలో 2018లో గెలిచిన ఏకైక బీజేపీ శాసనసభ్యుడైన రాజాసింగ్ ఇప్పుడు కమలం పార్టీకి దూరమయ్యారు. మరి ఆయన దారులు ఎటు...?2023లో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. వారిలో రాజాసింగ్ ఒకరు. మిగతావారికంటే ఈయన భిన్నం.. ఎందుకంటే హ్యాట్రిక్ ఎమ్మెల్యే. బహుశా తెలుగు రాష్ట్రాల్లో హ్యాట్రిక్ కొట్టిన బీజేపీ ఎమ్మెల్యే ఈయనేనేమో...? లేదా ఆ ఒకరిద్దరిలో రాజాసింగ్ ఒకరేమో?పాతబస్తీలో గోషామహల్ నుంచి మూడోసారి గెలిచిన రాజాసింగ్ బీజేపీకి రామ్ రామ్ చెప్పారు. మజ్లిస్ పార్టీకి పట్టున్న ఈ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తూ వస్తున్న రాజాసింగ్ మరిప్పుడు ఏం చేస్తారు? స్వతంత్ర ఎమ్మెల్యేగా ఉంటారా? లేక బీఆర్ఎస్ లో చేరుతారా? అధికార కాంగ్రెస్ వైపు మొగ్గుతారా? అనేది ఆసక్తికరంగా మారింది.రెండేళ్ల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజాసింగ్ బీజేపీ శాసనసభా పక్ష నేత పదవిని ఆశించారు. కానీ, కొన్ని అంశాల ప్రాతిపదికన ఏలేటి మహేశ్వర్ రెడ్డికి ఇచ్చారు. బీజేపీలో కేంద్ర మంత్రి బండి సంజయ్ అండదండలు ఉన్నప్పటికీ రాజాసింగ్ కు నిరాశ తప్పలేదు. అప్పటినుంచి పార్టీతో ఆయన అంటీముట్టనట్లు ఉంటున్నారు. విమర్శలు కూడా చేస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో ప్రచారం కూడా చేయలేదు. హైదరాబాద్ నియోజకవర్గంలో మహిళను నిలిపినా మద్దతు కూడా ప్రకటించలేదు.రాజాసింగ్ వ్యాఖ్యలను బట్టి చూస్తుంటే ఆయన తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారా? అనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డిని పలుసార్లు ప్రశంసించారు. మరోవైపు రాజాసింగ్ బీఆర్ఎస్ వైపు మొగ్గడానికి అవకాశం తక్కువే. ఆ పార్టీకి రాజాసింగ్ దూరం అన్నట్లుగానే ఉంటుంది వ్యవహార శైలి.

ఈ రెండూ కూడా కాకుండా రాజాసింగ్ బీజేపీలోనే కొనసాగే చాన్సులు ఎక్కువ. ఆయనపై ఇప్పటికే పలు వివాదాస్పద వ్యాఖ్యల కేసులు ఉన్నాయి. అందులోనూ పాతబస్తీలో నెగ్గాలంటే రాజాసింగ్ కు బీజేపీ వంటి పార్టీనే అవసరం. అటు బీజేపీకి కూడా రాజాసింగ్ ను వదులుకునే ఉద్దేశం ఉండదు. కాబట్టి ఆయనను బుజ్జగించి పార్టీలోనే కొనసాగించే అవకాశాలే అధికం.

## లవ్ మ్యారేజ్ చేసుకుందని మనమడ్ని దత్తత ఇచ్చేసిన తాత



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇష్టం లేని ప్రేమ పెళ్లి చేసుకుందన్న కోపంతో కూతురు బిడ్డ విషయంలో ఒక తండ్రి వ్యవహరించిన తీరు షాకింగ్ గా మారింది. విశాఖపట్నంలో చోటు చేసుకున్న ఈ ఉదంతం నగర పోలీస్ కమిషనర్ వద్దకు వెళ్లటం.. ఆ వెంటనే స్పందించిన ఆయన.. చిన్నారి ఆచూకీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీం పుణ్యమా అని.. మూడు గంటల్లోనే దొరికేశాడు. ఇంతకూ అసలేం జరిగిందన్న విషయంలోకి వెళితే..

అరకు ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల దివ్య స్వరూప తమ ప్రాంతానికే చెందిన జాన్ బాబును ప్రేమించింది. తండ్రికి ఇష్టం లేకున్నా ప్రేమ పెళ్లి చేసుకుంది. వీరి పెళ్లిని మొదట్నించి వ్యతిరేకిస్తున్న దివ్య తండ్రి. పి.శుక్ర..వారిద్దరిని విడదీయటానికి చాలానే ప్రయత్నాలు చేశారు. మొత్తానికి ఆయన పథకాలు ఫలించాయి. మనస్పర్థలతో వారిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. అదే సమయానికి దివ్య స్వరూప ప్రెగ్నెంట్ అయ్యింది. డెలివరీ కోసం తండ్రి వద్దకు వచ్చింది. విశాఖలోని కేజీహెచ్ లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే.. పుట్టిన వెంటనే పచ్చ కామెర్లు రావటంతో ఆసుపత్రిలోనే ఉంచానని.. అక్కడే వైద్యం చేయిస్తున్నట్లుగా చెప్పాడు. పలు పత్రాల మీద కుమార్తెతో సంతకాలు తీసుకున్నాడు. మరోవైపు.. పుట్టిన మగబిడ్డను తల్లికి తెలీకుండానే వేరు వారికి దత్తత పేరుతో ఇచ్చేసాడు.పిల్లాడు పుట్టి రెండు నెలలు అవుతున్నా.. ఆచూకీ లేకపోవటం.. తండ్రి ఏదో ఒక మాట చెప్పటంతో తన బిడ్డ ఆచూకీ కోసం ఆమె విశాఖలోని కంచరపాలెం పోలీసులకు.. అనంతరం నగర కమిషనర్ శంకబ్రత బాగ్చీకి కంప్లైంట్ చేశారు. పీసీ ఆదేశాలతో ఇన్ ఛార్జ్ సీఐ రవికుమార్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. మూడు గంటల విచారణలోనే రెండు నెలలుగా కనిపించకుండా పోయిన పసికందును పోలీసులు ట్రేస్ చేశారు.అనంతరం చిన్నారిని హెూంకు తరలించి.. కేసును విచారిస్తున్నారు.

# అనంత్ అంబానీ నెల జీతం ఎంత?



**హైదరాబాద్ పెన్ పవర్:** వేలాది కోట్ల ఆస్తిపరుడికి వారి కంపెనీలో ఇచ్చే జీతం ఎంత? అందునా భారతదేశ కుబేరుడైన రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ చిన్న కొడుకు అనంత్ అంబానీకి ఇచ్చే జీతం లెక్కలు తాజాగా వెలుగు చూశాయి. దీంతో.. అతడి వార్షిక వేతనాల లెక్కల్ని తెలుసుకునేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ముకేశ్ అంబానీ చిన్న కొడుకు అనంత్ అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా ఎన్నికైన సంగతి తెలిసిందే.తాజాగా బయటకు వచ్చిన అధికారిక పత్రాల్లోని సమాచారం ప్రకారం అనంత్ అంబానీ వార్షిక వేతనం రూ.10-20 కోట్ల మధ్యలో ఉండొచ్చని కంపెనీ వాటాదారులకు ఇచ్చిన నోటీసులో దీనికి సంబంధించిన వివరాల్ని వెల్లడించారు. అనంత్ అంబానీ ప్రస్తుతం రిలయన్స్ ఇంధన వ్యాపార బాధ్యతల్ని చూసుకుంటున్నారు.అంతేకాదు.. రిలయన్స్ గ్రూపు నిర్వహించే దాతృత్వ కార్యక్రమాలకు డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. రిలయన్స్ జియో ప్లాట్ ఫామ్స్.. రిలయన్స్ రిటైల్ వెంచర్స్ బోర్డుల్లోనూ సభ్యుడిగా ఉన్న అనంత్ కు లభించే వార్షిక ఆదాయం లెక్కలు చూస్తే కనిష్ఠంగా నెలకు కోటి రూపాయిల కంటే తక్కువగా.. గరిష్ఠంగా రూ.2 కోట్ల కంటే తక్కువ ఉండటం గమనార్హం.తన వారసత్వ ప్లానింగ్ లో భాగంగా ముకేశ్ అంబానీ తన ముగ్గురు పిల్లలు ఆకాశ్.. ఈశా.. అనంత్ లను 2023లోనే ఆర్ఐఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా నియమించారు. అయితే.. ఈ హెూదాలో వీరికి ఎలాంటి జీతాలు ఇవ్వరు. బోర్డు సమావేశాలకు హాజరైనందుకు మాత్రం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4 లక్షలు చొప్పున.. లాభాలపై కమిషన్ కింద ఒక్కొరికి రూ.97 లక్షలు చెల్లించారు.ఇక.. అనంత్ విషయానికి వస్తే సంసథ ఈడీగా ఈ ఏప్రిల్ లో నియమితులయ్యారు. ఈ హెూదాలో మాత్రం జీతభత్యాల్ని పొందుతారు. అంతేకాదు తన భార్యకు.. సహాయకులకు అయ్యే ప్రయాణ ఖర్చులతో పాటు.. ఆహారం.. వసతి ఖర్చుల్ని కూడా రీపే చేస్తారు. కంపెనీ వ్యాపారానికి కారు ఏర్పాట్లు.. నివాసంలోని కమ్యూనికేషన్లకు అయ్యే ఖర్చుల్ని కూడా కంపెనీ తిరిగి చెల్లిస్తుంది. భద్రతతో పాటు.. వైద్య చికిత్సలకు అవసరమయ్యే ఖర్చుల్ని కూడా కంపెనీనే భరిస్తుంది. దీంతో పాటు నికర లాభం ఆధారంగా వేతనం పొందే వెసులుబాటు ఉంది.

# కోల్ కతా గ్యాంగ్ రేలిప్.. సంచలన విషయాలు వెల్లడించిన పోలీసుల!




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌత్ కోల్ కతా లా కాలేజీలో విద్యార్థిని (24) పై ఓ పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్ విద్యార్థులు కలిసి క్యాపస్ లోనే అత్యాచారం చేసిన ఘటన తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. అదే రాష్ట్రంలో గత ఏడాది ఆర్జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన తర్వాత జరిగిన ఈ సంఘటన దిగ్భ్రాంతి కలిగించింది. దీనిపై పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు.అవును.. సౌత్ కోల్ కతా లా కాలేజీలో విద్యార్థినిపై జరిగిన గ్యాంగ్ రేపు తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. ఈ కేసులో సెక్యూరిటీ గార్డు సహా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు! ఈ సందర్భంగా పోలీసులు పలు కీలక విషయాలు వెల్లడించారు.ఇందులో భాగంగా... ఈ కేసులో అరెస్టైన ముగ్గురు నిందితులు పక్కా ప్లాన్ ప్రకారమే న్యాయ విద్యార్థినిపై అత్యాలిచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ముందు నుంచే విద్యార్థినులను వేధించిన చరిత్ర వారికి ఉందని వెల్లడించారు. పలు సందర్భాల్లో రికార్డు చేసిన దృశ్యాలతో విద్యార్థులను బ్లాక్ మెయిల్ చేసేవారని తెలిపారు.ఈ క్రమంలోనే వీరి చేతిలో అత్యాలిచారానికి గురైన విద్యార్థినిని కాలేజీలోకి అడుగుపెట్టిన తొలి రోజే వేధించారని.. ఆమెపై అత్యాచారానికి ముందు కూడా లైంగికంగా వేధిస్తూ రికార్డు చేసిన దృశ్యాలతో బ్లాక్ మెయిల్ చేయాలని ప్లాన్ చేశారని తెలిపారు! ఈ నేపథ్యంలో.. అత్యాచారానికి సంబంధించిన వీడియోలు ఎవరికైనా షేర్ చేశారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

దీనికోసం.. ముగ్గురు నిందితుల ఫోన్ లను ఇప్పటికే స్వాధీనం చేసుకొన్నామని చెప్పిన పోలీసులు.. నిందితుల ఇళ్లల్లోనూ సోదాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో... స్టూడెంట్స్ యూనియన్ రూమ్, వాష్ రూమ్, గార్డ్స్ రూమ్ నుంచి ఈ ఘటనకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిపారు.కాగా... విద్యార్థినికి ఇప్పటికే వైద్య పరీక్షలు నిర్వహించగా.. అందులో ఆమెపై గ్యాంగ్ రేలిప్ జరిగినట్లు నిర్ధారణ అయ్యిందనే సంగతి తెలిసిందే! ఈ సందర్భంగా.. బాధితురాలి వ్యక్తిగత అవయవాలను గాయపరిచారని.. మెడ చుట్టూ, ఛాతీపై పంటి గాట్లు, గోళ్లతో గీరిన గాయాలయ్యాయని చెబుతున్నారు!

మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడిగా చెబుతోన్న మోనోజిత్ మిశ్ర (31) అకృత్యాల గురించి పలువురు జూనియర్ విద్యార్థులు పోలీసులకు కీలక విషయాలు వెల్లడించినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా.. తనను పెళ్లి చేసుకుంటావా అంటూ ప్రతి అమ్మాయితో మాటలు కలిపేవాడని.. ఈ క్రమంలోనే అత్యాచారానికి గురైన యువతిని అలానే వేధించేవాడని తెలిపారు.

# సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటనలో పథ్నాలుగుకు పెరిగిన మృతుల సంఖ్య




**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో పథ్నాలుగు మంది మరణించారు. మరో 26 మందికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో సిగాచీ కంపెనీ మేనేజర్ కూడా ఉన్నారు. వీరిలో పన్నెండు మంది పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. సిగాచి రసాయన పరిశ్రమలో ఇంకా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుంది. ఇంకా కొందరు కార్మికులు భవనాల శిధిలాల కింద చిక్కుకుని ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఉదయం 9.30 గంటల ప్రాంతలో ఈ ప్రమాదం జరగ్గా వెంటనే అగ్నిమాపకసిబ్బంది తో పాటు అన్నిశాఖల అధికారులు వచ్చి సహాయక చర్యలుప్రారంభించారు. అయితే ప్రమాదం జరగడానికి గల కారణాలను కూడా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కుటుంబ సభ్యుల ఆందోళన...**

మరొక వైపు సిగాచి పరిశ్రమవద్ద ఉద్రిక్తత నెలకొంది. పరిశ్రమ లోపలికి వెళ్లేందుకు కార్మికుల కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. కానీ పోలీసులు ఎవరిని వెళ్లనివ్వడంలేదు. తమ వారి ఆచూకీ చెప్పాలని వారు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాయపడిన వారిని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలోమొత్తం 108మంది కార్మికులు విధుల్లో ఉన్నట్లు అక్కడ సిబ్బంది చెబుతున్నారు. ఇంకా కొందరిమంది పరిశ్రమలోపల చిక్కుకుపోయి ఉన్నారు. సిగాచీ రసాయన పరిశ్రమలో రాయాక్టర్ ఒక్కసారిగా పేలడంతో దాదాపు ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల వరకూ పేలుడు శబ్దం వినిపించింది.

**మరో పన్నెండుమంది పరిస్థితి ఆందోళనకరం...**

పరిశ్రమలో జరిగిన పేలుడు కారణంగా అక్కడికక్కడే ఐదుగురు మరణించగా మరో తొమ్మిదిమంది గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించారని అధికారులు తెలిపారు. పేలుడు ధాటికి వంద మీటర్ల దూరంలో కార్మికులు పడిపోయారు. రియాక్టర్ ఉన్న భవనం కూడా కూలిపోవడంతో పెద్ద ప్రమాదమే సంభవించింది. మృతదేహాలన్నీకాలిపోవడంతో గుర్తించేందుకు ఫోరెన్సిక్ నిపుణులు ఆసుపత్రికి చేరుకున్నారు. మార్చురీకి చేరుకున్న ఫోరెన్సిక్ నిపుణులు మృతదేహాలను గుర్తించే పనిలో పడ్డారు. మృతులు ఎక్కువ మంది ఒడిశా,బీహార్ కు చెందిన కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడిన వారందరికీ మెరుగైన వైద్య సౌకర్యాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. మంత్రుల బృందం కూడా ఘటన స్థలాన్నిపరిశీలించింది. ప్రభుత్వం కార్మికుల కుటుంబాలను ఆదుకుంటుందని చెప్పారు.

# ద్రవిడ్, సెహ్వాగ్ రికార్డుపై జైస్వాల్ కన్ను.. 97 పరుగుల దూరంలో యువ సంచలనం!

- టెస్టుల్లో అత్యంత వేగంగా 2000 పరుగుల రికార్డుకు చేరువలో జైస్వాల్
- ద్రవిడ్, సెహ్వాగ్ రికార్డును బద్దలు కొట్టేందుకు గొప్ప అవకాశం
- 40 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించిన దిగ్గజాలు
- ప్రస్తుతం 38 ఇన్నింగ్స్‌లలో 1903 పరుగులు చేసిన యశస్వి
- రికార్డు బ్రేక్ చేయాలంటే మరో 97 పరుగులు అవసరం
- ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో ఈ ఫీట్ అందుకునే ఛాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ సంచలనం, ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్టు క్రికెట్‌లో ఓ అరుదైన రికార్డుకు అత్యంత చేరువలో ఉన్నాడు. భారత క్రికెట్ దిగ్గజాలైన రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్‌ల పేరిట ఉన్న ప్రతిష్ఠాత్మక రికార్డును బద్దలు కొట్టేందుకు సిద్ధమయ్యాడు. టెస్టు ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 2వేల పరుగులు పూర్తిచేసిన భారత బ్యాటర్‌గా నిలిచే సువర్ణావకాశం అతడి ముందు నిలిచింది.ప్రస్తుతం ఈ రికార్డు ద్రవిడ్, సెహ్వాగ్‌ల పేరిట సంయుక్తంగా ఉంది. వీరిద్దరూ తమ కెరీర్‌లో 40 ఇన్నింగ్స్‌లలో 2000 పరుగుల మైలురాయిని చేరుకున్నారు. 1999లో న్యూజిలాండ్‌పై ద్రవిడ్ ఈ ఘనత సాధించగా, 2004లో ఆస్ట్రేలియాపై సెహ్వాగ్ దీనిని అందుకున్నాడు. అయితే, 2023 జులైలో వెస్టిండీస్‌పై అరంగేట్రం చేసిన యశస్వి జైస్వాల్ కేవలం 38 టెస్టు ఇన్నింగ్స్‌లలోనే 52.86 సగటుతో 1,903 పరుగులు సాధించి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు.ఈ నేపథ్యంలో జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరగనున్న రెండో టెస్టు మ్యాచ్ జైస్వాల్‌కు కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో అతను మరో 97 పరుగులు చేయగలిగితే, కేవలం 39 ఇన్నింగ్స్‌లలోనే 2,000 పరుగుల మార్క్‌ను అందుకుంటాడు. తద్వారా ద్రవిడ్, సెహ్వాగ్‌లను వెనక్కి నెట్టి సరికొత్త చరిత్ర సృష్టిస్తాడు.ఇటీవల లీడ్స్‌లోని హెడింగ్లీలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో జైస్వాల్ అద్భుతంగా రాణించాడు. 159 బంతుల్లో 16 ఫోర్లు, 6 సిక్సర్లతో 101 పరుగులు చేసి శతకంతో కదం తొక్కాడు. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కేవలం 4 పరుగులకే ఔటై నిరాశపరిచాడు. ఈ నేపథ్యంలో రెండో టెస్టులో నిలకడగా ఆడి ఈ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంటాడని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 8 నెలలకే మార్చేశారు.. పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు కొత్త కోచ్





**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులకు ఇదేం కొత్త విషయం కాకపోవచ్చు. సిరీస్ ఓడిన ప్రతిసారి పాకిస్తాన్ క్రికెట్‌లో ఇలాంటి ఘటనలు సదా మామూలే. పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఓటములకు బాధ్యులైన ఆటగాళ్లను తప్పించాల్సింది పోయి కోచ్‌లను మారుస్తూ ఉంటుంది. ఇప్పుడు మరోసారి అలాంటిదే జరిగింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 2025-27 కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తమ టెస్ట్ జట్టుకు కొత్త కోచ్ ను నియమించింది.పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (%ూజదీ%) సోమవారం (జూన్ 30) పాక్ రెడ్-బాల్ జట్టుకు ప్రధాన కోచ్‌గా మాజీ ఆల్ రౌండర్ అజార్ మహమూద్‌ను నియమిస్తూ కీలక ప్రకటన చేసింది. ఆస్ట్రేలియా చేతిలో టీ20 సిరీస్ కోల్పోయిన గంటల వ్యవధిలోనే ఆ జట్టు ప్రధాన కోచ్ జేసన్ గిలెస్పీపై వేటు వేసింది. గిలెస్పీ స్థానంలో గత ఏడాది నవంబర్ లో ని పాక్ క్రికెట్ బోర్డు ఆ జట్టు మాజీ బౌలర్ ఆకిబ్ జావేద్‌ను నియమించగా.. 8 నెలల తర్వాత జావేద్ స్థానంలో తాజాగా ఆల్ రౌండర్ అజార్ మహమూద్‌ను తీసుకొచ్చి ఆశ్చర్యపరించింది.2016 నుంచి 2019 మధ్య పాకిస్తాన్ బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన అనుభవం మహమూద్ కు ఉంది. 2023లో న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అతను స్టాండ్-ఇన్ హెడ్ కోచ్‌గా కూడా పనిచేశాడు. పాక్ డొమెస్టిక్ క్రికెట్ లో కరాచీ కింగ్స్, ముల్తాన్ సుల్తాన్స్‌ల జట్లకు బౌలింగ్ కోచ్‌గా.. ఇస్లామాబాద్ యునైటెడ్‌కు ప్రధాన కోచ్‌గా పని చేసిన అనుభవం ఉంది. 1996 నుంచి 2007 వరకు మధ్య కాలంలో పాకిస్థాన్ జట్టు తరపున మహమూద్ ప్రాతినిధ్యం వహించాడు. పాక్ తరపున 21 టెస్టులు, 143 వన్డేలు ఆడాడు. టెస్ట్ క్రికెట్‌లో 100 కంటే ఎక్కువ వన్డే వికెట్లు తీయడంతో పాటు మూడు సెంచరీలు చేశాడు. 2025 టెస్ట్ ఛాంపియన్ షిప్ లో భాగంగా అక్టోబర్ లో పాకిస్థాన్ తమ తొలి సిరీస్ సౌతాఫ్రికాతో ఆడనుంది. మహమూద్ కోచ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తోలి సిరీస్ ఇదే. పాకిస్తాన్ 2023-25 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లో ఘోరంగా ఆడింది. పాయింట్ల పట్టికలో 9 వ స్థానంలో నిలిచింది. ఐదు విజయాలు సాధించిన పాక్.. తొమ్మిది ఓటములతో 27.98 పాయింట్ల శాతాన్ని సాధించారు. 2023-24 మధ్య వరుసగా ఆరు టెస్ట్ పరాజయాలు ఉన్నాయి.

# 'మిస్టర్ కూల్' ట్యాగ్‌పై ట్రేడ్ మార్క్ రిజిస్టర్ చేసుకున్న ధోనీ





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్.. ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ సారధి మహేంద్ర సింగ్ ధోనీ తన ఐకానిక్ ట్యాగ్ 'కెప్టెన్ కూల్' ట్రేడ్‌మార్క్‌ను రిజిస్టర్ చేసుకున్నారు. రిపోర్ట్స్ ప్రకారం ఈ టీమిండియా మాజీ నాయకుడు జూన్ 5, 2023న జార?ండ్‌లో ట్రేడ్‌మార్క్‌ను దాఖలు చేశాడు. దరఖాస్తు సమాచార చిత్రం సోషల్ మీడియాలో కనిపించడంతో వైరల్ గా మారుతుంది. వైరల్ అయిన పోస్ట్ ప్రకారం, భారత మాజీ కెప్టెన్ జూన్ 5న రితి స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా టైటిల్ కోసం ట్రేడ్‌మార్క్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.ట్రేడ్ మార్క్స్ రిజిస్ట్రీ పోర్టల్ ప్రకారం.. ఈ ట్రేడ్‌మార్క్ జూన్ 16, 2025న అధికారిక ట్రేడ్‌మార్క్ జర్నల్‌లో ప్రచురించబడింది. "ట్రేడ్‌మార్క్ చట్ట రంగంలో ఇటీవలి పరిణామాన్ని పంచుకోవడం ఆనందంగా ఉంది. ఇది వ్యక్తిత్వ హక్కులకు సంబంధించినది". అని ధోని న్యాయవాది మాన్సి అగర్వాల్ అన్నారు. ట్రేడ్‌మార్క్ కలిగి ఉండటం వలన క్రీడాకారులు తమ పేరు, లోగో లేదా బ్రాండ్‌ను రక్షించుకోవడానికి చట్టపరమైన అధికారం కలిగి ఉంటారు. ట్రేడ్‌మార్క్‌తో అనుమతి లేకుండా మరొకరు తమ గుర్తింపును ఉపయోగించడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్య తీసుకోవడం సులభం అవుతుంది.ఒక ఆటగాడు అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించగానే క్రేజ్, ఫాలోయింగ్ తగ్గిపోవడం సహజం. కానీ భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ విషయంలో దీనికి భిన్నం. ఈ స్టార్ ఆటగాడికి ఆటకు గుడ్ బై చెప్పిన తర్వాత క్రేజ్ ఆకాశాన్ని దాటేసింది. ఇంత అభిమానానికి కారణం ఐపీఎల్ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ లో చెన్నైకు ప్రాతినిధ్యం వహిస్తున్న ధోనీ కెప్టెన్ గా జట్టును 5 సార్లు ఛాంపియన్ గా నిలిపాడు. తన కూల్ కెప్టెన్ తో టీమిండియాకు టీ20, వన్డే వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్స్ అందించాడు. దీంతో ఫ్యాన్స్ ధోనీని ముద్దుగా కెప్టెన్ కూల్ గా పిలుచుకుంటారు. 43 ఏళ్ళ ధోనీ ప్రస్తుతం ఇటీవలే ఐపీఎల్ 2025 ముగించుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తో తన అనుబంధాన్ని కొనసాగిస్తున్నాడు. గత రెండు సీజన్ లో చివర్లో వచ్చి మెరుపులు మెరిపిస్తూ ఫ్యాన్స్ కు ఖుషీ చేస్తున్నాడు. 2023 ఐపీఎల్ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్సీ బాధ్యతల నుండి వైదొలిగిన ధోనీ 2025 ఐపీఎల్ లో గైక్వాడ్ గాయంతో మరోసారి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. 2026 ఐపీఎల్ సీజన్ లో ఆడతాడా లేదా అనే విషయంలో ధోనీ ఇంకా ఎలాంటి నిర్ణయం అధికారికంగా ప్రకటించలేదు.

# బీచ్ రిసార్ట్‌లో హీరోయిన్ విలాసాలు



నేహా మాలిక్ కేన్స్ 2025 రెడ్ కార్పెట్ వస్త్రధారణ

వేడెక్కించే ఫోటోషూట్లతో నిరంతరం అందరి దృష్టి తనవైపు ఉండేలా చూసుకోవడంలో అవ్ నీత్ చాణక్యం మెచ్చదగినదే. కానీ ఈ భామ ఇటీవల హద్దు మీరుతోంది. టూమచ్ గా గ్లామర్ ని ఆరబోసేందుకు ఉత్సాహపడుతోంది. తాజాగా అవ్ నీత్ గ్లామరస్ ఫోటోషూట్ ఒకటి ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. బికినీ బీచ్ లో ఒక అందమైన రిసార్ట్ లో అవ్ నీత్ ఫుల్ గా చిల్ చేస్తోంది. ఇందులో స్విమ్మింగ్ పూల్ సహా ప్రతిదీ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అక్కడే జాగింగ్.. జిమ్.. స్విమ్మింగ్ సహా సకలసౌకర్యాలు అవ్ నీత్ కి అందుబాటులో ఉన్నాయని అర్థమవుతోంది. అవనీత్ కౌర్ బుల్లితెరపై కెరీర్ ప్రారంభించి, అటుపై సినీరంగంలో ప్రవేశించింది. కౌర్ మర్దానీలో మీరా పాత్రతో టికు వెడ్స్ షేరులో టికు పాత్రలతో పాపులరైంది. చంద్ర నందినిలో చారుమతి, అలాద్దీన్‌లో యాస్మిన్ - నామ్ తో సునా హెూగా చిత్రాల్లో పాత్రలతో ఆకట్టుకుంది. కౌర్ 2010లో జీటీవీ డ్యాన్స్ షో %-%డాన్స్ ఇండియా డాన్స్- లిటిల్ మాస్టర్స్%-%తో తన వృత్తిని ప్రారంభించింది. అవ్ నీత్ సెమీ-ఫైనల్‌కు ముందే ఎలిమినేట్ అయింది. ఆ తర్వాత డ్యాన్స్ కే సూపర్‌స్టార్స్‌లో పాల్గొంది. ఈ వేదికలో ఆమె %-%డ్యాన్స్ ఛాలెంజర్స్%-% బృందంలో చేరింది. కౌర్ 2012లో లైఫ్ ఓకే మేరీ మాతో తన నటనా రంగ ప్రవేశం చేసింది. ఇందులో ఆమె జిల్మిల్ పాత్రను పోషించింది. ఆ తర్వాత సాబ్ టీవీలో తేధే హై పర్ తేరే మేరే హైన్‌లో నటించింది. 2012లో, కలర్స్ టీవీ సెలబ్రిటీ డ్యాన్స్ రియాలిటీ షో ఝలక్ దిఖ్లా జాలో పాల్గొంది, అక్కడ ఆమె దర్శీల్ సఫారీతో పోటీ పడింది. ఈ షోలో కనిపించిన అతి పిన్న వయస్కురాలు అవ్ నీత్. స్వతహాగానే క్రేజీ షోలలో చూసిన ప్రజలు తనను అభిమానించడం ప్రారంభించారు. అటుపై కౌర్ లైఫ్ ఓకే లో సావిత్రి - ఏక్ ప్రేమ్ కహానీలో నటించింది. అందులో రాజకుమారి దమయంతి పాత్ర పోషించింది. ఆగస్ట్ 2013లో కౌర్ జీ టీవీ %-%ఏక్ ముత్తి ఆస్మాన్%-%లో పాఖీ పాత్ర పోషించింది. కౌర్ 2014లో ప్రదీప్ సర్కార్ %-%మర్దాని%-%తో తన సినీ జీవితాన్ని ప్రారంభించింది. అటుపై వరుస చిత్రాల్లో నటిస్తోంది. ఆమె సన్నీ సింగ్ సరసన లవ్ కి అరేంజ్డ్ మ్యారేజ్‌లో కూడా నటించింది.





నభా నటేష్ అందం, స్టైల్ మరియు మనోజ్ఞతను కొల్లగొట్టింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com